





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 169 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల సోమవారం 23 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE 169 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA MON 23 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు

## జగన్ కుట్ర

### మంత్రి నిమ్మల రామానాయుడు

పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి ప్రతిష్టను భంగపరిచేలా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుట్రలు పన్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంతో పాటు యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని రసాయనాల మిశ్రమంతో అపవిత్రం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి విమర్శించారు. లడ్డూ తయారీలో నెయ్యికి బదులు రసాయనాలు కలిశాయని సీబీఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొన్నా, జగన్ ఏ మొహం పెట్టుకుని మాట్లాడు తున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన శ్రీవారి పటాలను శాసనమండలిలో ప్లకార్డులుగా ప్రదర్శించడం దారుణమని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని మండిపడ్డారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..**

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పాలకొల్లులో రూ. 4.43 కోట్ల విలువైన పనులకు

- మిగతా2లో

## టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

### గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

- గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని సమర్థతపై ప్రశంసలు
- ఏపీలోని 17,000 మంది డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ సేవలను కూడా డాక్ సేవకుల ద్వారా అందిస్తామని హామీ
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోస్టల్ ఉద్యోగులదే కీలక పాత్ర అని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించిన వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

**కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు

- మిగతా2లో



## జగన్ హిందూ వ్యతిరేకి..

### అసెంబ్లీ చర్చకు రావాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సవాల

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నిప్పులు చెరిగా రు. జగన్ ఒక 'హిందూ వ్యతిరేకి' అని, ఆయ నకు హిందూ

- మిగతా2లో



## ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

పెన్ పవర్ డెస్క్:ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. జగన్ పై, వైసీపీ నేతలపై బురద చల్లడమే చంద్రబాబు లక్ష్యమా అని అన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పినా కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని

- మిగతా2లో

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు...

### పదవీ విరమణ వరకూ వేటు!



- ఐపీఎస్ సునీల్ కుమార్‌పై కొనసాగనున్న సస్పెన్షన్
- ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ప్రధాన ఆరోపణలు
- సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వాదన

- మిగతా2లో

## రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

### ఈ జిల్లాల్లో దంచికొడుతున్న భారీ వర్షం

పెన్ పవర్ డెస్క్:వాతావరణ శాఖ అలర్ట్ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడ న ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం తర్వాత వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో

- మిగతా2లో



మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు

## ఆశ్చర్యపోయాయి

### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

- ఏఐ సదస్సు ద్వారా అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామన్న మోదీ
- జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఏఐ వినియోగం చూసి ఆశ్చర్యపోయారన్న మోదీ
- సైబర్ నేరాల పట్ల హెచ్చరిక జారీ చేసిన నరేంద్ర మోదీ
- 10 నెలల చిన్నారి అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు.ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి

- మిగతా2లో

## దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ-మీరట్ ఆర్‌ఆర్‌టీఎస్ కారిడార్




పెన్ పవర్ డెస్క్: దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు

- మిగతా2లో

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

### అగ్రనేతలు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి
- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- వీరితో పాటు 16 మంది లొంగుబాటు

- మిగతా2లో

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్



## ఎడిటర్ వ్యూ

# కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!

కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

**1. ఒక చికిత్స సరిపోదు**

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**2. ఎంత శ్రమకు అంత ఫలితం**

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

**3. వ్యాయామం ఏదైనా**

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

**4. తోడుగా చేస్తే**

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

**5. నైపుణ్యం సాధిస్తే**

వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

**6. ఫలితాలు నెమ్మదిగా**

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

# జగన్ హిందూ వ్యతిరేకి..

- మొదటి పేజి తరువాయి

సంప్రదా యాల మీద గౌరవం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరును, వైసీపీ నేతల వైఖరిని ఎండగట్టారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలోకి శ్రీ వెంకటేశ్వర స్వామి ఫొటోను తీసుకొచ్చే సమయంలో వైసీపీ నేతలు చెప్పులు వేసుకుని ఉండటం ఘోరమైన అపరాధమని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే పవిత్రమైన భగవంతుడిని సభలోకి తెచ్చారని, ఆ సమయంలో జరిగిన పొరపాటు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నా వైసీపీ నేతలు బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

**తిరుమల పవిత్రతపై విమర్శలు..**

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై స్పందిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో జంతు కొవ్వుతో పాటు హానికర రసాయనాలు కలిశాయని నివేదికలే చెబుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. జగన్ తన హయాంలో ఏనాడూ పవిత్ర సంప్రదాయాలను గౌరవించలేదని, శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సమయంలో తన సతీమణితో కలిసి వెళ్లకపోవడమే దానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే తిరుమలలో అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి జగన్ నిరాకరించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

**అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?**

జగన్ అహంకారం చూసే భగవంతుడు గతంలో ఉన్న 151 సీట్ల నుండి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారని మంత్రి ఎద్దేవా చేశారు. టీటీడీ నిధులను దారి మళ్లించారని, భక్తి లేని వ్యక్తులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా జగన్‌ను సరిదిద్దాల్సింది పోయి, ఆయన తప్పులను సమర్థించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న జగన్, దమ్ముంటే అసెంబ్లీకి రావాలని మంత్రి సవాల్ విసురుతూ.. 'నువ్వు అసెంబ్లీకి రా.. అక్కడ బహిరంగ చర్చకు మేము సిద్ధం' అని పిలుపునిచ్చారు.

# ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ముగిసే వరకు లేదా ఆయన పదవీ విరమణ చేసే తేదీ వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ అడిషనల్ డీజీగా, ఆ తర్వాత సీఐడీ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై క్రిమినల్ కేసు (క్రైమ్ నెం. 187/2024) నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ఏసీబీ కోర్టులో విచారణ దశలో ఉంది.

ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సునీల్ కుమార్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు సస్పెన్షన్ పొడిగింపు తప్పనిసరి అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటితో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా 2020 నుంచి 2024 మధ్య పలుమార్లు విదేశాలకు వెళ్లడం, అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై కూడా ఆయన ఏసీబీ విచారణను

ఎదుర్కొంటున్నారు.ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ ఢ అప్పీల్) రూల్స్, 1969లోని రూల్ 3(3) ప్రకారం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సునీల్ కుమార్ పదవీ విరమణ తేదీ 2026 జూన్ 30 కావడంతో, అప్పటివరకు కేసుల విచారణ పూర్తికాకపోతే ఆయన సర్వీసులో చేరకుండానే రిటైర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

- మొదటి పేజి తరువాయి

'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు.

కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

# టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు

- మొదటి పేజి తరువాయి

ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి**

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపా రు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర

- మొదటి పేజి తరువాయి

శంకుస్థాపన చేశారు. కొంతేరు గ్రామంలో రూ. 58 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కనికరం లేకుండా వ్యవహరించిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ నిష్పక్షపాతంగా పింఛన్లు అందిస్తోందని నిమ్మల పేర్కొన్నారు. రాజధాని నిర్మాణంతో రాష్ట్ర యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

## ఏపీలో లడ్డూ సమస్య తప్ప ఇంకేమీ లేవా?

- మొదటి పేజి తరువాయి

ప్రశ్నించారు. పోలీసులను రాజకీయ కక్షల కోసం వాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని అన్నారు. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేశారని, 5 గంటల నుండి 12 గంటలు దాడి జరుగుతూనే ఉందన్నారు. పోలీసులే ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ కనీసం పట్టించుకోలేదని, రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు, వైవిధ్యాలు ఉంటాయని చెప్పారు. పోలీసులను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలు ఆలోచించమని కోరుతున్నానని అన్నారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.

వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

## రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

- మొదటి పేజి తరువాయి

లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వానలు పడుతున్నట్లు సమాచారం అందుతోంది.

అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (×వీణ) ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు.ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# అరకు వేలి పోలీస్ స్టేషన్ సందర్శించిన డిఎస్పి అభిషేక్.

పెన్ పవర్ ప్రతినిధి అరకులోయ..

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో ఆదివారం పాడేరు డిఎస్పి అభిసెట్ అరకు వ్యాలీ పోలీస్ స్టేషను సందర్శించిరు, పోలీస్ స్టేషన్ యొక్క రికార్డ్స్ మరియు పెండింగ్ లో ఉన్న కేసులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులను తొందరగా పూర్తి చేయాలని సిఐ శ ఎల్ హిమగిరి. కి మరియు ఎస్ఐ జి గోపాలరావు. ఆదేశించారు , రోడ్ యాక్సిడెంట్లు అవ్వకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని , అరకు పరిధిలో గంజాయి పండించడం గాని గంజాయి రవాణా పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు, పోలీస్ టేషన్ సిబ్బంది వాళ్ళ యొక్క డ్యూటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.




# నరసరావుపేటలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర

## -ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు






నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: నరసరావుపేట పట్టణ మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. పట్టణంలోని మోర్ సెంటర్ వద్ద శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా హాజరై ప్రజలకు సందేశం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్నట్టు అయన తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని అయన పిలుపునిచ్చారు. ఈ –వేస్ట్ సేకరణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ఇళ్లలో మరియు దుకాణాల్లో పాత ఎలక్ట్రానిక్ వస్తువులను నిల్వ చేయకుండా ప్రత్యేకంగా సేకరించి సంబంధిత ప్లాంట్‌కు పంపించి శాస్త్రీయ విధానంలో డిస్పోజల్ చేసి రీసైక్లింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఇలా చేయడం ద్వారా నేల, నీరు, గాలి, కాలుష్యాన్ని నివారించవచ్చని అయన తెలిపారు. దీనివల్ల శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు మరియు ఇతర ఆరోగ్య సమస్యల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ , శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రెటరీలు, వర్కర్లు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.



# కదం తొక్కిన చేనేత గర్జన...



బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 22.

మంగళగిరి మెయిన్ బజార్ లో చేనేత గర్జన మూడు కిలోమీటర్ల సాగిన ర్యాలీరాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన చేనేత సోదర సోదరీమణులందరూ పాల్గొన్నారు.చేనేత గర్జన మంగళగిరి గాలిగోపురం మెయిన్ బజార్ మీదగా నేతన్న సర్కిల్ వరకు 2000 మందితో భారీ ర్యాలీ నిర్వహించిన చేనేత సంఘాలుచేనేత సంఘం నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూమేము ఏ పార్టీ వ్యతిరేకంగా చేయడం లేదు ఏ పార్టీకి అనుకూలంగా కూడా చేయడం లేదు మా చేనేత కులాన్ని వృత్తిని బ్రతికించేందుకే మా పోరాటందశాబ్దాలుగా అనకారి పోతున్న మా చేనేత వర్గాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు విడుదల చేయాలని అందించాలని ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి అనేదే మా పోరాటంరాష్ట్రంలోని 16 సంఘాలతో చేనేత గర్జన మహా సభరూ.203 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

# మైనారిటీల సంక్షేమంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుంది : ప్రత్తిపాటి

## ముస్లింల కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీమంత్రి.





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 22 :

చిలకలూరిపేట : ముస్లిం మైనారిటీల సంక్షేమంలో కూటమిప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుందని, రాష్ట్రానికి ఆర్థిక సమస్యలున్నా.. వారికి ఉపయోగపడుతుందనే సదుద్దేశంతో రూ.30 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని ప్రారంభించినట్టు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు.ఆదివారం ఆయన స్థానిక మద్దినగర్ లో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి తాను చేసిన మంచి తప్ప, గత పాలకులు ఏమీ చేయలేదన్నారు. మైనారిటీలు వాస్తవాలు ఆలోచించి, తమకోసం పనిచేసే మంచి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రత్తిపాటి సూచించారు. మైనారిటీల సద్వినియోగం కోసమే రూ.30 లక్షలతో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, భవిష్యత్ లో ఈ భవనాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు సయ్యద్ వహబ్, బేరింగ్ మౌలాలి, ముల్లా కరీముల్లా, తుపాకుల అప్పారావు, బ్రహ్మం, బాజీ, బారి, వేటపాలెం సుభాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

## మంత్రికి దగ్గరుండి కోటప్పకొండ గురించి వివరించిన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: కోటప్పకొండ లో పూర్ణకుంభంతో మంత్రికి ఘన స్వాగతం పలికిన ఆలయ అధికారులు అర్చకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు. శనివారం సాయంత్రం ఉప్పలపాడు దగ్గర ఏర్పాటు చేయనున్న ఆటోనగర్ సంబంధించిన ప్రతిపాదనను త్వరగతిన పూర్తి చేయాలని మంత్రి ని కోరడం జరిగింది. నరసరావుపేట నియోజకవర్గంలో కార్మిక సంక్షేమం మరియు ఈఎస్ఐ వైద్య సదుపాయాల బలోపేతం కోసం నిధుల మంజూరు చేయాలని మంత్రిని కోరారు. పల్నాడు జిల్లా ముఖ ద్వారమైన నరసరావుపేట పట్టణ అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడిందన్నారు. కార్మిక, కర్మాగార, బాయిలర్స్ & వైద్య బీమా సేవల శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ ని నరసరావుపేట శాసనసభ్యులు, బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందజేశారు.

నరసరావుపేట నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పట్టణంలో మోటార్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అయితే వాహనాల మరమ్మతులు, సేవా కేంద్రాలు, గ్యారేజీలు, స్పేర్ పార్ట్స్ దుకాణాలు ఒకే ప్రదేశంలో లేని కారణంగా వ్యాపారులకు, వాహనదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నరసరావుపేట పట్టణంలో లేదా పట్టణానికి సమీప ప్రాంతంలో సుమారు 60 ఎకరాల భూమిని కేటాయించి ఆటో అవసరం ఉం ఏ యువతకు ఉపాధి లభిస్తుందని అయన తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలో కార్మిక సంక్షేమం మరియు ఈఎస్ఐ వైద్య సదుపాయాల బలోపేతం కోసం నిధుల మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

నరసరావుపేట నియోజకవర్గంలో గణనీయ సంఖ్యలో పారిశ్రామిక, నిర్మాణ మరియు అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు నివసిస్తూ పనిచేస్తున్నారు. వారి సంక్షేమం, భద్రత మరియు మెరుగైన వైద్య సదుపాయాల కోసం క్రింది పనులకు ఆమోదం తెలుపుతూ అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు.

ఈఎస్ఐ వైద్య సదుపాయాలు

నరసరావుపేటలో కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీ స్థాపన. ప్రస్తుతం ఉన్న ఈఎస్ఐ సదుపాయాల బలోపేతం కోసం అదనపు వైద్యులు మరియు సిబ్బంది నియామకం నిర్ధారణ సదుపాయాలు (ల్యాబ్, ఎక్స్–రే, ఫార్మసీ) ఏర్పాటు అత్యవసర సేవలు మరియు ప్రాథమిక ఆసుపత్రి సదుపాయాలు కల్పించడం

పారిశ్రామిక మరియు నిర్మాణ కార్మికుల కోసం మొబైల్ మెడికల్ యూనిట్ ఏర్పాటు. కార్మిక శాఖ మౌలిక వసతులు

నరసరావుపేటలో కొత్త కార్మిక శాఖ కార్యాలయ భవనం నిర్మాణానికి ఆమోదం. కార్మికుల సౌకర్యార్థం కార్మిక సంక్షేమ మరియు సదుపాయ కేంద్రం స్థాపన. డబ్ల్యూ పిఎస్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహణ.

ఈ అంశాలను సానుకూలంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకుని అవసరమైన నిధులను మంజూరు చేయవలసిందిగా కోరారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దర్శించుకునేందుకు శనివారం రాష్ట్ర మంత్రివర్యులు వాసంశెట్టి సతీష్ కోటప్పకొండకు చేరుకున్నారు. కోటప్పకొండలో మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద ఆశీర్వచనాలతో, పూర్ణకుంభ స్వాగతంతో ఘనంగా ఆహ్వానం పలికారు. ఆలయం యొక్క విశిష్టత, ఆనందవల్లి అమ్మవారి చరిత్ర, గిరి ప్రదక్షిణ ప్రాధాన్యం, ఇటీవల ఉపముఖ్యమంత్రి పర్యటన నాలుగు కోట్లతో నిర్మించిన రోడ్డు ప్రారంభం తదితర అంశాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కోటప్పకొండ తిరుణాళ్ళ ఘనవిజయం సాధించడంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కృషి విశేషమని ప్రశంసించారు. తిరుణాలకు నెలరోజుల ముందుగానే ఏర్పాట్లు ప్రారంభించి, ప్రతిరోజూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సూచనలు అందించిన ఎమ్మెల్యే నాయకత్వంలో శ్రీ త్రికోటేశ్వర స్వామి వార్షికోత్సవ మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించగలిగామని మంత్రి తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఉమ్మడి ఓటమి నేతలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు



# అటహాసంగా కార్తిక టౌన్షిప్

## సామాన్యులకు అందుబాటులో వెంచర్


## టౌన్షిప్ లో ప్లాట్ కొనుగోలు చేసిన మొదటి108 మంది సభ్యులకు

## లక్కీ డిప్పులో పాల్గొనే సదుపాయం,

## టౌన్ షిప్ ప్రారంభించిన మాచర్ల శాసనసభ్యులు జుల కంటి బ్రహ్మానందరెడ్డి

పెన్ పవర్ కారంపూడి ఫిబ్రవరి 22 :----

మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్ లో గల ఎల్ సి కె ఫ్యాక్టరీ ఎదురుగా మున్సిపల్ అధికారుల అనుమతులతో శ్రీ సాయి డెవలపర్స్ వారి కార్తిక టౌన్ షిప్ ఆదివారం మాచర్ల శాసనసభ్యులు జులకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. సామాన్యులకు అందుబాటు ధరలు వెంచర్లు ను ఏర్పాటు చేయడం జరిగిందని టౌన్ షిప్ నిర్వాహకులు భవనాసి రామ్మూర్తి, పమ్మి శ్రీనివాసరెడ్డి, బొగ్గారపు శ్రీనివాసరావు, పోలా సత్యనారాయణ, చేకూరి సూర్యనారాయణ, లుతెలిపారు, టౌన్ షిప్ గ్రాండ్ ఎంట్రెన్స్ ఆర్చి, మున్సిపాలిటీ వారిచే ఆమోదించిన లే అవుట్, వాస్తు గుణంగా రూపొందించిన లేఅవుట్, 100% క్లియర్ టైటిల్ లేఅవుట్ ,స్పాట్ రిజిస్ట్రేషన్, విశాలమైన 12,9, మీటర్ల సిసి రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కు, పిల్లలు ఆట స్థలము, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మరియు వాటర్ పైప్ లైన్స్, విద్యుత్తు స్ట్రీట్ లైట్స్, రోడ్డు కిరువైపులా పచ్చని చెట్లు, లేఔట్ చుట్టూ సెక్యూరిటీతో కూడిన సోలార్ కాంపౌండ్, టైల్స్ తో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేయడం జరిగింది నిర్వాహకులు తెలిపారు




# శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాలలో ఘనంగా 75వ వార్షికోత్సవ వేడుకలు

## అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: నరసరావుపేటలో స్థానిక శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల బహిరంగ వేదికపై 75వ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా కళాశాల కమిటీ అధ్యక్షులు కపలవాయి విజయ కుమార్, కార్యదర్శి మరియు ప్రతినిధి అలాగే నరసరావుపేట మాజీ పురపాలక సంఘాధ్యక్షులు నాగసరపు సుబ్బరాయ గుప్తా, కళాశాల గౌరవ అధ్యక్షులు ఎం.వి. రామకృష్ణ కొండలరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఊటుకూరి వెంకట అప్పారావు, కమిటీ సభ్యులు కూనిశెట్టి లక్ష్మయ్య , వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి భావన్నారాయణ, పెనుగొండ ప్రభాకరరావు, కళాశాల ఉప ప్రిన్సిపాల్ డా. పి. శ్రీనివాస సాయి పాల్గొన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న డా. చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ తాను ఈ కళాశాల పూర్వ విద్యార్థినని, ఇక్కడే విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థితికి ఎదిగానని అయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. సుధీర్ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రతిభతో ఘన విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. వార్షికోత్సవాల భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని అలరించాయి.విద్యార్థుల ఉత్సాహ నినాదాల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందించిన సహకారం విశేషంగా నిలిచింది.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అంతర్జాతీయ వేదికపై అవమానం

# కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

## నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22:
ఢిల్లీలో శనివారం నిర్వహించిన గ్లోబల్ ఏఐ సమ్మిట్ సందర్భంగా జరిగిన ఘటనలపై నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాలు, పలువురు దేశాల ప్రతినిధులు, ప్రముఖ నాయకులు హాజరైన అంతర్జాతీయ వేదికపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడం దేశ గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు అవమానకరంగా ప్రవర్తించారని, ఇది అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠను తగ్గించిందని విమర్శించారు. దేశ ప్రయోజనాల కంటే కాంగ్రెస్ పార్టీకి స్వార్థ రాజకీయాలే ముఖ్యమని ఆయన ఆరోపించారు. ఇటువంటి చర్యలు ప్రపంచ వేదికపై భారతదేశాన్ని నవ్వులపాలు చేసేలా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా, ఈ ఘటనలను వైసీపీ ఖండించకపోవడం ఆశ్చర్యకరమని, దేశ ప్రయోజనాల విషయంలో తల్లిపిల్ల కాంగ్రెస్ పార్టీల వైఖరి ఒకటేనని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# గోవా పర్యాటక విధానం బాపట్లకు ఆదర్శం

## - గోవా సీఎంను కలిసిన కలెక్టర్ బృందం:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 22:
జిల్లాలో తీర ప్రాంత పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా మూడు రోజుల పాటు గోవా రాష్ట్రంలో అధ్యయన పర్యటన చేపట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ బృందం శనివారం పర్యటనను ముగించింది. ఈ సందర్భంగా బృందం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశంలో గోవాను ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దిన విధానంపై కలెక్టర్ బృందం హర్షం వ్యక్తం చేసింది. పర్యటన సందర్భంగా అక్కడి అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున గోవా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శాలువా కప్పి సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేయగా, గోవా పర్యాటక విధాన పుస్తకాన్ని ముఖ్యమంత్రి కలెక్టర్ బృందానికి అందించారు. సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. గోవా పర్యటనలో పొందిన అనుభవాలను బాపట్ల తీర ప్రాంత అభివృద్ధిలో అమలు చేస్తామని కలెక్టర్ బృందం వెల్లడించింది. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి, తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్టు మేనేజర్లు శివ శరణ్, షేక్ సజిత్ పాల్గొన్నారు.



## తొలి తెలుగు స్వాతంత్ర్యసమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘననివాళి అర్పించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 22:
తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదివారం నాడు తన క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 1857 సిపాయిల తిరుగుబాటుకు పదేళ్ల ముందే, 184647 కాలంలోనే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా రాయలసీమలో సాయుధ పోరాటం చేసిన ధీశాలి నరసింహారెడ్డి అని కొనియాడారు. నిరంకుశ పన్ను విధానాలకు వ్యతిరేకంగా సుమారు 5,000 మంది రైతులతో సైన్యాన్ని నిర్మించి, కోయిల్‌కుంట్ల, ఎం.ఎం. కడప జిల్లాలోని బ్రిటిష్ ఖజానాలపై దాడులు చేసి వారిని గజగజలాడించారని గుర్తుచేశారు. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన కొత్త భూసేకరణ విధానాలు మరియు పాలెగాళ్ల వ్యవస్థ రద్దు వంటి చర్యలు రైతులపై భారం వేయడంతో నరసింహారెడ్డి గారు తిరుగుబాటు బావుటా ఎగురవేశారని ఎస్పీ తెలిపారు. వడ్డే ఓబన్న వంటి నమ్మకమైన అనుచరులతో కలిసి కెప్టెన్ వాట్సన్ నాయకత్వంలోని బ్రిటిష్ సైన్యాన్ని గిద్దలూరు వద్ద ఓడించారని పేర్కొన్నారు. చివరికి, 1847 ఫిబ్రవరి 22న కోయిల్‌కుంట్లలోని రాళ్ల బురుజు వద్ద వందలాది మంది ప్రజల సమక్షంలో బ్రిటిష్ వారు ఆయన్ను ఉరితీశారని, ఆ రోజున ఆయన వీరమరణం పొందారని వివరించారు. నరసింహారెడ్డి అపురూప త్యాగానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2017లో ఆయన చిత్రపటంతో తపాలా స్టాంప్‌ను విడుదల చేసిందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమని ఎస్పీ అన్నారు. నరసింహారెడ్డి శౌర్యం మరియు తెల్లదొరలపై ఆయన చేసిన ధైర్యసాహసాల పోరాటం తెలుగు వారి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్, చుండూరు సీఐ ఆనందరావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పల్నాడు ప్రగతి రథ సారథి డాక్టర్ చదలవాడ అరవింద బాబు

## జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో గర్జించిన నరసరావుపేట సింహం నియోజకవర్గ సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో ముఖాముఖి చర్చ

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: పల్నాడు జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపాలనే సంకల్పంతో, నిరంతరం ప్రజల కోసం పరితపించే నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, నేడు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన హైలెవల్ డెవలప్‌మెంట్ రివ్యూ మీటింగ్‌లో తనదైన ముద్ర వేశారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన, కలెక్టర్ మరియు ఎస్పీ సమక్షంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో అరవింద బాబు నియోజకవర్గ అభివృద్ధిపై గళం విప్పారు.
అభివృద్ధిపై అలుపెరుగని పోరాటం. ఈ సమీక్షా సమావేశంలో డాక్టర్ చదలవాడ అరవింద బాబు కేవలం హాజరు కావడమే కాకుండా, నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా కోటప్పకొండ రెండో ఘాట్ రోడ్డు పల్నాడు ఆరాధ్య దైవం కోటప్పకొండ పుణ్యక్షేత్రానికి రెండో ఘాట్ రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనను బలంగా వినిపించి, టెంపుల్ టూరిజాన్ని విశ్వవ్యాప్తం చేయాలని మంత్రిని కోరారు. రైతు పక్షపాతి: వేసవి కాలంలో రైతాంగానికి సాగునీటి కష్టాలు రాకూడదని, ముఖ్యంగా మొక్కజొన్న పంటలకు మార్చి ఆఖరి వరకు నీటిని విడుదల చేయాలని పట్టుబట్టారు. నీటి ఎద్దడి నివారణ: రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ: పల్లపు చెరువు, కథవా చెరువుల అభివృద్ధి ద్వారా నియోజకవర్గ రూపురేఖలు మార్చాలని విజ్ఞప్తి చేశారు.
ప్రజాప్రతినిధుల ఐక్యత - మంత్రి సానుకూల స్పందన: ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మారెడ్డి తదితరులతో కలిసి అరవింద బాబు జిల్లా పురోగతికి దిశానిర్దేశం చేశారు. అరవింద బాబు విజ్ఞప్తులకు స్పందించిన ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నియోజకవర్గంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
ప్రజల మనిషిగా, అభివృద్ధి కాముకుడిగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు చూపుతున్న చొరవ పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఖ్యాతిని దశదిశలా చాటేలా ఆయన చేస్తున్న కృషి అభినందనీయం







# అపర మేధావి, భారత విద్యా వ్యవస్థా శిల్పి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్మరిద్దాం

## -నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 69వ వర్ధంతి సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని చిత్రాలయ కూడలి వద్ద ఆదివారం ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, 1888లో మక్కా నగరంలో జన్మించిన ఆజాద్ గారు చిన్ననాటి నుంచే అనేక భాషలలో పాండిత్యం సంపాదించి అపూర్వ మేధావిగా ఎదిగారని పేర్కొన్నారు. పత్రికా రచయితగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ విముక్తి కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.
స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నత విద్యా సంస్థలకు బలమైన పునాదులు వేశారని తెలిపారు. దేశ సాంకేతిక విద్యా సంస్థలు, భారత విజ్ఞాన సంస్థ, విశ్వవిద్యాలయ మంజూరీ సంఘం వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల అభివృద్ధికి ఆయన దూరదృష్టి కారణమని పేర్కొన్నారు. అలాగే లలిత కళా అకాడమీ, సంగీత నాటక అకాడమీ వంటి సాంస్కృతిక సంస్థలను స్థాపించి భారతీయ కళలు, సంస్కృతిని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. కులమతాలకు అతీతంగా అక్షరాస్యతను పెంపొందించడమే ఆయన లక్ష్యమని, ప్రతి పౌరుడు ఆజాద్ గారి ఆశయాలను స్మరిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అని శాసనసభ్యులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆజాద్ కి అంజలి ఘటించారు.





# పేరం గరుడాచలం నాయుడు ఆశయాల దిశగా తూర్పు సత్రం అభివృద్ధి

## ప్రముఖుల సందర్శనతో కొత్త ఉత్సాహం

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 22:
బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. పట్టణంలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్యలను, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్, తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి సత్రానికి ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన తులసి రామచంద్ర ప్రభు, ఉగ్గిరాల సీతారామయ్యలు సత్రానికి విచ్చేసి, ప్రాంగణంలోకి చేరుకున్న వెంటనే మహనీయుడు పేరం గరుడాచలం నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్రం ఆవరణలోని భవనాలు, వసతులు, నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి రోజువారీ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన మరమ్మతులు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ, పేరం గరుడాచలం నాయుడు కలలు కన్న ఆశయాలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచేలా సత్రాన్ని స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. గతంలో బాటసారులు విశ్రాంతి తీసుకోవడానికి, సొంత ఇల్లు లేని పేద కుటుంబాలు దహన కార్యక్రమాలు పూర్తయ్యేంతవరకు మృతదేహాన్ని సత్రంలో ఉంచుకునే విధంగా, దిన కార్యక్రమాలు చేసుకునేలాగా, పరిస్థితులను గమనించి, అలాంటి వారికి సహాయంగా ఈ సత్రాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. అనంతరం ఉగ్గిరాల సీతారామయ్య మాట్లాడుతూ, బాపట్లతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గరుడాచలం నాయుడు చేసిన దానం, సేవా తత్వం వృథా కాకుండా అందరం కలిసికట్టుగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇరువురు ప్రముఖులు తూర్పు సత్రం అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచి, మరింత మంది పేదలకు ఉపయోగపడేలా అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ, పేరం గరుడాచలం నాయుడు వంటి మహనీయుల ఆశయాలను నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సత్రం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ప్రముఖుల సందర్శనతో తూర్పు సత్రానికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. పేరం గరుడాచలం నాయుడు సేవా స్ఫూర్తి తరతరాలకు ఆదర్శంగా నిలవాలని, ఆయన అన్నారు



# మహా అభియాన్ వర్క్ షాప్ సమావేశం...

## -బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.మట్టా ప్రసాద్...

పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 22.
పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ మహా అభియాన్ జిల్లా కార్యశాల కార్యక్రమం స్థానిక లాల్ పురం రోడ్ లోని జిల్లా కార్యాలయం వాజ్ పేయ్ భవన్ లో జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా భరతమాత, శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్, ఉపాధ్యాయ చిత్రపటాల కి పూలమాలలు వేసి కార్యక్రమం మొదలుపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రశిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా మండలాల్లో ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని ఏ విధంగా చేయాలి అనే విషయాలని వివరించడం జరిగింది మండల ప్రశిక్షణ సమావేశాలు మార్చి 7 నుంచి ఏప్రిల్ 14 వరకు అన్ని మండలాల్లో ఈ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం పూర్తి చేయాలనీ కార్యకర్తలకు వివరించడం జరిగింది. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సంఘటన పర్వ్ పూర్తయిన తర్వాత ప్రతిసారి లాగే ఇప్పుడు కూడా ప్రశిక్షణ అభియాన్ పూర్తి చేస్తామని కానీ ఇప్పుడు మండల స్థాయిలో చేసుకోవటం చాలా ముఖ్య విషయం అని ఈ మండలాల్లో జరిగే ప్ర శిక్షణ కార్యక్రమాల్లో బిజెపి కార్యకర్తలు ప్రతి ఒక్కరు పాల్గొని పార్టీ సంస్థాగతంగా సిద్ధాంతాన్ని తెలుసుకోవాలని ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త విషయాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. అలాగే వాటితో పాటు పార్టీ యొక్క సిద్ధాంతాన్ని ప్రజలకు చేరువయ్యే విధంగా కొత్త నడవడితో టెక్నాలజీ ద్వారా ప్రజలకు చేరువయ్యే విధంగా పనిచేయాలని వారు కార్యకర్తలకు సూచించారు. ఈ ప్రశిక్షణ అభియాన్ జిల్లా వర్క్ షాప్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రశిక్షణ కార్యక్రమంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని భారతీయ జనతా పార్టీ మంచినీళ్లు పారే ఒక కాలువ లాంటిదని ఆ కాలవలో పాత నీటితోపాటు, కొత్తనీరు కూడా చేరుతుందని రాగితో పాత కొత్త కలయికలతో పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఈ రోజున ప్రతి ఒక్కరూ కొన్ని విషయాలపై సమగ్రంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు భారతీయ జనతా పార్టీ సంస్థాగతంలో భాగంగా పంచ్ పరివర్తన ద్వారా మనము కూడా అనేక విషయాలు తెలుసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావజాలం , కుటుంబం ప్రభోదనలు, పౌర విధులు పాటించడం ఈ ఐదు సూత్రాలు చాలా ముఖ్యమని అన్నారు ఎందుకంటే ఈ రోజున పర్యావరణం లో చాలా మార్పులు వచ్చి ప్రజలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని రానున్న రోజుల్లో పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ఏ ఒకరిదో కాకుండా మనమందరం బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాన్ని పరిరక్షణ ఇచ్చే విధంగా చేయాలని, అలాగే మనమందరం ఈ రోజున ఏ ఒక్క వస్తువు కొనాలన్నా గాని ప్లాస్టిక్ సంచి మీద ఆధారపడుతున్నామని అటువంటి ప్లాస్టిక్ ని మనం అందరం నిషేదించాలని ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను అలవాటు చేసుకోవాలని అన్నారు.
కుటుంబంలో ఈ రోజున వస్తున్న అనేక మార్పులు ఈ సమాజానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని అందుకని ప్రతి ఒక్క తల్లిదండ్రులు కుటుంబంలో పిల్లలతో స్నేహంగా ఉంటూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఓల్డ్ ఏజ్ హోమ్ కి పంపించకుండా మన సంరక్షణలో బాధ్యతగా ఉంచుకోవాలని తల్లిదండ్రులను దైవంగా పూజించాలని ఇటువంటి చిన్న చిన్న విషయాలను మన పిల్లలకి నేర్పించాలని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ హక్కులు అయితే కోరుకుంటున్నారు గాని బాధ్యతలు మాత్రం ఎవరు తీసుకోవడం లేదని హక్కులు ఏ విధంగా అయితే కోరుకుంటారో బాధ్యతలు కూడా తీసుకునే విధంగా ముందు మనమందరం నేర్చుకోవాలని అన్నారు. సమాజంలో కుల, మత భేదాలు లేకుండా అందరం ఒకటే భావనతో కలిసి మెలిసి ఉండాలని మన ఇంట్లో పనిచేసే సిబ్బందిని కూడా మన కుటుంబ సభ్యులు లాగా భావించి వారి సుఖదుఖాల్లో పాలుపంచుకోవాలి. వారి పిల్లల చదువుకు, సంక్షేమానికి మనం తోడ్పాటు ఇవ్వాలని అలాగే అట్టడుగు వర్గాలకు చెందిన మహనీయుల జయంతి వేడుకల్లో పాల్గొని వారి యొక్క గొప్పతనాన్ని నీతిని మనం తెలుసుకొని మన భావితరాలకు తెలియజేసే విధంగా ఉండాలని అన్నారు. మన భారతదేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలి అంటే ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని ఈ దేశంలో తయారయ్యే స్వదేశీ వస్తువులకు డిమాండ్ పెరిగితే దానివల్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఈ స్వదేశీ వస్తువులు తయారు చేసే ఉత్పత్తిదారులతో నిరంతరం సంబంధాలను కొనసాగిస్తూ వారికి కృషి వారి ఈ సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించటం వల్ల వారు మరింత ప్రోత్సాహంతో పని చేస్తారని, ఈ స్వదేశీ వస్తువుల వల్ల ఈ దేశానికి ఆదాయం పెరిగి మన దేశ వ్యవస్థను మరింత పటిష్టంగా బలపరుచుకునే అవకాశం ఉంటుందని తద్వారా ఈ దేశాన్ని ప్రపంచ దేశాల కంటే దీటుగా మనము ముందుకు వెళ్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివన్నారాయణ, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, టుబోకో బోర్డు చైర్మన్ సి. యశ్వంత్, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా ప్ర శిక్షణ కో-కన్వీనర్స్ చరక కుమార్ గౌడ్,చాగంటి హరి పావని, మేడూరు యశ్వంత్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి



దర్శనపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఈదర శ్రీనివాస రెడ్డి, అనంత ఆచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ,తోట శ్రీనివాస్, మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.వి సుబ్బారావు, నడ్డి నాగ మల్లీశ్వరి, ఫైరోజ్ ఖాన్,జిల్లా పదాధికారులు మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బిజెపి రాష్ట్ర మోర్చా పదాధికారులు, మండల అధ్యక్షులు, మండల ప్రశిక్షణ కన్వీనర్లు, కో -కన్వీనర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు

# కన్నుల పండుగగా తెదేపా పార్టీ కార్యాలయం శంకుస్థాపన

-అతిరథ మహారధుల సమక్షంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం -పెద్ద ఎత్తున తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

-తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష -నిజాయితీ నికార్సైన కార్యకర్తలు తెలుగుదేశం సొంతం

-ప్రమాణ స్వీకారం మహోత్సవంలో మంత్రులు, ఎమ్మెల్యేలు.









పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 22:
తెలుగుదేశం పార్టీకి మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచే కార్యక్రమం ఆదివారం బాపట్లలో అంగరంగ వైభవంగా జరిగింది. బాపట్ల పార్లమెంట్ మరియు నియోజకవర్గ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం, అలాగే బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

కొత్త కంకటపాలెం సమీపంలో దివ్య ముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అతిరథ మహారధుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు.

ప్రముఖుల సమక్షంలో శుభారంభం....

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.యన్. విజయ్ కుమార్, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ తదితరులు హాజరై భూమిపూజలో పాల్గొన్నారు.

అదేవిధంగా కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా నాయకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష...

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "నిజాయితీ, నికార్సైన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతం. కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష" అని అన్నారు. కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని, ప్రజల కోసం పనిచేసే వ్యక్తులకు ఈ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఎన్టీఆర్ ఆవిర్భావం నుండి చంద్రబాబు, లోకేష్ సమర్థ నాయకత్వంలో పార్టీ ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా కార్యకర్తలు నిద్రాహారాలు మాని పార్టీ కోసం కృషి చేశారని కొనియాడారు.

"పార్టీ కార్యాలయం ప్రతి కార్యకర్తకు దేవాలయం లాంటిది. అధికారంలో ఉన్నా లేకున్నా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుంది" అని స్పష్టం చేశారు.

వైసిపిపై విమర్శలు....

గత పాలకులు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని, అబద్ధాల పునాదులపై ఏర్పడిన పార్టీ వైసీపీ అని విమర్శించారు. ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, దేవుడి పేరుతో కూడా రాజకీయాలు చేయడం సరికాదని మండిపడ్డారు.

అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం....

భూమిపూజ అనంతరం వేలాది మంది కార్యకర్తల సమక్షంలో బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం ముఖ్య అతిథులకు, కమిటీ సభ్యులకు పూలమాలలు, శాలువాలతో ఘన సత్కారం నిర్వహించారు.

బాపట్లలో జరిగిన ఈ కార్యాలయ శంకుస్థాపన మరియు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. భవిష్యత్ రాజకీయాలకు బాపట్ల కేంద్రంగా మారబోతుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చాటింది.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపుమేరకు పర్చూరు నుంచి వందలాది వాహనాలలో వేలాది మంది కార్యకర్తలు భారీ ర్యాలీగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు

## సీఎంకు ఎమ్మెల్యే నసీర్ ఘన స్వాగతం...

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 22.
గుంటూరు నగర శివారులోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ లో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కమ్యూనికేషన్స్ కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారతదేశంలో డాక్ సేవలు అత్యంత విలువైనవని చెప్పారు. ప్రతి గ్రామాన్ని అనుసంధానిస్తూ ప్రజల వద్దకు పోస్టల్ సేవలను తీసుకెళుతున్న జీడిఎస్ లకు ధన్యవాదాలు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పోస్టల్ శాఖలో టెక్నాలజీని తీసుకొచ్చిందని అన్నారు. దీని ద్వారా ప్రతి వ్యక్తికీ పోస్టల్ తో అనుసంధానం కలిగి ఉంటుందని పేర్కొన్నారు



## జగన్ పాపాల పాలన ఫలితమే ప్రజల్ని పట్టి పీడిస్తున్న రెవెన్యూ, ఇతర భూ సమస్యలు : ప్రత్తిపాటి

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మాజీమంత్రి ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 22 :
చిలకలూరిపేట : పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు ప్రత్తిపాటి స్వయంగా స్వీకరించారు. జగన్ పాపాల పాలన ఫలితమే ప్రజల్ని పట్టి పీడిస్తున్న రెవెన్యూ, ఇతర భూ సమస్యలని, వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి గారు ప్రత్యేక దృష్టి పెట్టారు అని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్) లో భూ వివాదాలకు సంబంధించి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్లకు ఆస్కారం లేకుండా రాజమార్గంలో అన్ని అనుమతులుండటమే అందరికీ మంచిదనీ అన్నారు. మాజీ అవినీతిమంత్రి, ఆమె అనుచరులు, కుటుంబసభ్యులు కాలువలు, చెరువులు, డొంకలు, జాతీయ రహదారి భూముల్ని కూడా ప్రజలకు అంటగట్టి పరారయ్యారన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.





## టిడ్కో గృహస్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం: ప్రత్తిపాటి

**రూ.3.60 కోట్లతో 30 గదుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాం.**

**స్థానికంగా నివాసముంటూ, ఉపాధి లేని వారికే ఈ షాపులు కేటాయిస్తాం.**

**దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీమంత్రి**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 22 :
చిలకలూరిపేట : 5,520 టిడ్కో గృహాల్లో నివసించే పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడేలా, స్థానికంగా నివసించే కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించేలా 52 ఎకరాల్లో నిర్మితమైన టిడ్కో ప్రాంగణంలోనే అధునాతన దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం ఆయన చిలకలూరిపేట పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద రూ.3.60 కోట్లతో నిర్మించ తలపెట్టిన దుకాణ సముదాయ నిర్మాణానికి (షాపింగ్ కాంప్లెక్స్) శంకుస్థాపన చేశారు. అనంతరం టిడ్కో గృహాలను పరిశీలించి, నివాసముంటున్న వారితో మాట్లాడిన ప్రత్తిపాటి వారు తెలియచేసిన సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**రూ.3.60 కోట్లతో 30 దుకాణాలతో నూతన షాపింగ్ కాంప్లెక్స్**

5,520 కుటుంబాలకు ఉపయోగపడేలా రూ.3.60 కోట్లతో 30 షాపులు వచ్చేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఈ షాపులను స్థానికంగ నివసించే వారికే అందించే ఆలోచన చేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. టిడ్కో గృహాల్లో ఉండేవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్న ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ ను 6 నెలల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్టు ప్రత్తిపాటి చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కౌన్సిలర్ జంగా సుజాత, బేరింగ్ మౌలాలి, పాములపాటి శివమ్మ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, మున్సిపల్ డి.ఈ అబ్దుల్ రహీమ్ టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు





## పెద్ద రెడ్డిపాలెంలో డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు విగ్రహ ఆవిష్కరణ

**-విగ్రహ ఆవిష్కరణ పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 22: పల్నాడు గడ్డపై అభివృద్ధి ప్రదాతగా, పేదల పెన్నిధిగా చెరగని ముద్ర వేసిన మాజీ స్పీకర్, దివంగత నేత స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు సేవలు చిరస్మరణీయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కొనియాడారు. పెద్ద రెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు విగ్రహాన్ని ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ.. పల్నాడు పులిగా పేరుగాంచిన కోడెల ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. ఒక వైద్యుడిగా వృత్తి పట్ల నిబద్ధత, రాజకీయ నాయకుడిగా ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న తపన నేటి తరానికి ఆదర్శమని అయన పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో కోడెల పాత్ర మరువలేనిదని, ఆయన చూపిన బాటలోనే తాము కూడా పయనిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. గ్రామంలో కోడెల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన స్మృతిని చాటుకున్న పెద్ద రెడ్డిపాలెం గ్రామస్తులను, అభిమానులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోడెల తనయుడు శివరాం, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, కోడెల అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించారు.






02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244

షరతులు వర్తిస్తాయి


## కూటమిప్రభుత్వం అన్నిమతాలను, వర్గాలను గౌరవిస్తోంది : ప్రత్తిపాటి.

**దేవుని వాక్యంతో ప్రజలకు రక్షణ : ప్రత్తిపాటి-చిలకలూరిపేటలోని మహాకూటముల్లో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 22 :
చిలకలూరిపేట : దేవుని వాక్యంతో ప్రజల కష్టాలు తొలగించి, వారికి రక్షణ కల్పించేందుకు, దేవుని ఆత్మతో ప్రజలను పరిశుద్ధులను చేసేందుకు మహా కూటములు ఏర్పాటు చేయడం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట మండలం రాజాపేట గ్రామంలో తండ్రి సన్నిధి మినిస్ట్రీస్ వారి నేత్రత్వంలో దైవజనులు బ్రదర్ షాలెం రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న మహా కూటములకు ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని షాలెం రాజు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్తిపాటి క్రైస్తవ సమాజాన్ని ఉద్దేశించి తన సందేశం వినిపించారు. రాజకీయాలకు అతీతంగా దైవ కార్యక్రమాలు నిర్వహించే వారిలో షాలెం రాజు ఒకరని, వారి ప్రతి ప్రార్థనా పేదల సంతోషం, ఆరోగ్యం కోసమే ఉంటుందని, వారి నేత్రత్వంలో జరుగుతున్న మహాకూటములు ప్రజల జీవితాల్లో తప్పకుండా మార్పు తీసుకొస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కాకాని, గుంటూరులో జరిగే మహాకూటములు, సభలను మించి చిలకలూరిపేటలో షాలెం రాజు మహా కూటములను ఏర్పాటు చేయడం నిజంగా క్రైస్తవులకు గర్వకారణమన్నారు. కూటమిప్రభుత్వం సర్వమతాలను గౌరవిస్తుందని, అన్నివర్గాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని ప్రత్తిపాటి చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యత... భద్రత... గౌరవంల సమాహారమే జనసేన సభ్యత్వం...

**-పండగ వాతావరణంలో జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టాలి-ప్రతీ ఇంట్లో జనసేన సభ్యత్వం నమోదయ్యేలా కృషి చెయ్యాలి.**

**-జెన్ జీని పార్టీకి మరింత చేరువ చేసేలా ప్రత్యేక ప్రణాళిక.-రికార్డు స్థాయి సభ్యత్వ నమోదే లక్ష్యం.**

**-సభ్యత్వ నమోదు మహా యజ్ఞంలో జనసైనికులు... వీరమహిళలు పెద్దఎత్తున పాల్గొనాలి.-శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్**

పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 22.

సమాజం పట్ల గురుతర బాధ్యత , కుటుంబ భద్రత , సమాజంలో ఉన్నత గౌరవంల సమాహారమే జనసేన పార్టీ సభ్యత్వమని శాసనమండలి ప్రభుత్వ విప్ , పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ భావజాలం ఉన్నత ఆశయాలు , పార్టీ సిద్ధాంతాలను మనసావాచా నమ్మి పార్టీకి వెన్నుముకగా నిలుస్తున్న ప్రతీ జనసైనికుడు , వీర మహిళా సభ్యత్వ నమోదులో కీలకపాత్ర వహించాలని అయన కోరారు. పార్టీ సభ్యత్వ నమోదుకి సంభందించి గుంటూరు పార్లమెంట్ సమన్వయ కర్తగా నియమితులైన నేపథ్యంలో ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో అయన ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో రూపొందించిన సభ్యత్వ నమోదు గోడప్రతులను అయన ఆవిష్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును పండగలా జరపాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంట్లో జనసేన సభ్యత్వం నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రెన్యూవల్స్ తో పాటూ నూతన సభ్యులను చేర్చాలన్నారు. మరీ ముఖ్యంగా జెన్ జి తరాన్ని పార్టీకి చేరువ చేయాలని , దీంతో భవిష్యత్ రాజకీయాల్లో కొత్త తరానికి అవకాశం ఉంటుందన్నారు. గత సభ్యత్వ నమోదుకి మూడు నాలుగు రెట్లు మించి సభ్యత్వాలు నమోదు కావాలన్నారు. అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సభ్యత్వ నమోదుని ఒక యజ్ఞంలా చేపట్టాలని ఇది పార్టీలో అత్యంత కీలకమన్నారు. సభ్యత్వ నమోదుకి సంభంధించి పూర్తి వివరాలు రెండు రోజుల్లో వస్తాయని , పార్టీ శ్రేణులు రికార్డు స్థాయి సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలని హరిప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు , పార్టీ రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాస్ , పొన్నూరు ఇంచార్జ్ వడ్రాణం మార్కండేయ బాబు , రాష్ట్ర కార్యదర్శి , మైనారిటీ నాయకులు నాయబ్ కమాల్




,సీనియర్ నాయకులు చందు సాంబశివరావు, పత్తిపాడు సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వరరావు , తాడికొండ ఇంచార్జ్ విజయ్ శేఖర్ , లేబర్ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా రాజు , మిర్చియార్డ్ వైస్ చైర్మన్ మల్లిక , డైరెక్టర్లు విజయలక్ష్మి, నక్కల వంశీ ,జిల్లా , నగర కమిటీ సభ్యులు , డివిజన్ అధ్యక్షులు , మండల అధ్యక్షులు వీరమహిళలు పాల్గొన్నారు

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనే ప్రభుత్వ లక్ష్యం

## -గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్ రాజు

పెన్ పవర్, నల్లజర్ల:

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రభుత్వం పని చేస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంనల్లజర్ల మండలం పోతవరం గ్రామ కొత్తపేట చంద్రన్న కాలనీలో ఏర్పాటు చేయనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి 4 0 లక్షల నిధులు మంజూరు చేసి భూమి పూజ చేశారు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఈ భవన నిర్మాణానికి 40 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది. గ్రామ ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు అందేలా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నాం. అని అన్నారు, జల జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రజలకు శాశ్వతంగా స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు 35 లక్షల నిధులతోలి ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ కుళాయిలనుప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు. మండల పార్టీ అధ్యక్షులు తాతిని సత్యనారాయణ. మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్. సర్పంచ్ నూతి కుర్తి లక్ష్మణరావు. ఉప సర్పంచ్ ఏలేటి సత్యనారాయణ. (జె డి) ఎంపీడీవో ఎం వి. ఎస్ సత్యనారాయణ. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎం పోసమ్మ.. పంచాయతీ కార్యదర్శి మెస్సయ్య రాజు. ఎం చిన్న రామారావు. తదితర ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# పోలవరంలో బిటి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఏపి స్పోర్ట్స్ అధారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి...

పెన్ పవర్, జీలుగుమిల్లి

పోలవరం మండలంలోని ఇటుకలకోట గ్రామం నుండి రేపల్లెవాడ జంక్షన్ వరకు రూ.3.3 కోట్లతో బిటి రోడ్లు నిర్మాణ పనులకు ఆదివారం ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఏపి స్పోర్ట్స్ అధారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏపీ ట్రైకార్ చైర్మన్, ఏపి స్పోర్ట్స్ అధారిటీ డైరెక్టర్ లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కి, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు కి, కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో రోడ్లకు పూర్వ వైభవం తెచ్చేలా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. వేల కోట్ల నిధులతో గుంతలు పూడ్చడం, మరమ్మతులతో పాటు నూతన రోడ్ల నిర్మాణం చేస్తున్నారన్నారు.రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ట్రైకర్ చైర్మన్, శాప్ డైరెక్టర్ లకు ప్రజలు అభినందనలు తెలిపారు. అలాగే నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు రహదారిని అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్ను వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఇంటికలకోట సర్పంచ్ సున్నం. చంద్రమ్మ, పోలవరం టిడిపి మండల అధ్యక్షులు మంగిన. వెంకటరమణ (కొండ) జనసేన మండల అధ్యక్షులు గునపర్తి. సత్యనారాయణ,(చిన్ని) ఐ టి డి పి అధ్యక్షులు కోడి. శ్రీనివాస్, బిజెపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కరిబండి. నాగరాజు, మాజీ ఎంపీటీసీ సున్నం. గంగాజలం,పోలవరం నీటి సంఘం అధ్యక్షులు పాదం. ప్రసాద్, వింజరం నీటి సంఘం అధ్యక్షులు పాయం. వెంకటేష్, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ ఆకుల (కొండబాబు) ( రాజా) జనసేన మండల ప్రధాన కార్యదర్శి చీకట్ల.సాయి కృష్ణమూర్తి, టిడిపి






సీనియర్ నాయకులు జల్లేపల్లి. ధర్మరాజు,(రాజా) జనసేన నాయకులు సిద్ధన. రామకృష్ణ, మామిడిపల్లి. వరప్రసాద్, నల్ల రాంబాబు, నాగేంద్ర, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులు మౌనిక - గీతానాథ్ లను ఆశీర్వదించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమేపల్లి వెంకటసుబ్బయ్య

పెన్ పవర్, ఎడ్లపాడు

ఎడ్లపాడు గ్రామం వాస్తవ్యులు గొరిజాల రవీంద్ర బాబు కుమార్తె వివాహం చిలకలూరిపేట పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ నందు అంగరంగ వైభవంగా జరుగుచుండగా ఆ వేడుకకు హాజరై నూతన వధూవరులు మౌనిక - గీతానాథ్ లను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమేపల్లి వెంకటసుబ్బయ్య .ఈకార్యక్రమంలో వారివెంట లివలేటి హిమవంతరావు , కల్లూరి బుల్లియ్య ,నాగభూషణం దొప్పలపూడి హరిబాబు తదితరులున్నారు.

# నూతన వధూవరులు లీల సాయి ప్రియ - పవన్ కళ్యాణ్ లను ఆశీర్వదించి, న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ...



పెన్ పవర్, చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ నందు శనివారం సాయంత్రం విజయ హనుమాన్ ఫ్లవర్ డెకరేషన్స్ & లీలా సాయి లైటింగ్స్ అధినేత అన్నపురెడ్డి కోటేశ్వరరావు కుమార్తె వివాహనిశ్చయ తాంబూలాల వేడుక జరుగుచుండగా ఆ వేడుకకు హాజరై కాబోయే నూతన వధూవరులు లీల సాయి ప్రియ - పవన్ కళ్యాణ్ లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ .

# టిడ్కో గృహస్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం: ప్రత్తిపాటి

**- రూ.3.60 కోట్లతో 30 గదుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాం. - స్థానికంగా నివాసముంటూ, ఉపాధి లేని వారికే ఈ షాపులు కేటాయిస్తాం.**

**- దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీమంత్రి.**

పెన్ పవర్, చిలకలూరిపేట

5,520 టిడ్కో గృహాల్లో నివసించే పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడేలా, స్థానికంగా నివసించే కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించేలా 52 ఎకరాల్లో నిర్మితమైన టిడ్కో ప్రాంగణంలోనే అధునాతన దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం ఆయన చిలకలూరిపేట పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద రూ.3.60 కోట్లతో నిర్మించ తలపెట్టిన దుకాణ సముదాయ నిర్మాణానికి (షాపింగ్ కాంప్లెక్స్) శంకుస్థాపన చేశారు. అనంతరం టిడ్కో గృహాలను పరిశీలించి, నివాసముంటున్న వారితో మాట్లాడిన ప్రత్తిపాటి వారు తెలియచేసిన సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

రూ.3.60 కోట్లతో 30 దుకాణాలతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ 5,520 కుటుంబాలకు ఉపయోగపడేలా రూ.3.60 కోట్లతో 30 షాపులు వచ్చేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఈ షాపులను స్థానికంగ నివసించే వారికే అందించే ఆలోచన చేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. టిడ్కో గృహాల్లో ఉండేవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్న ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ ను 6 నెలల్లో పూర్తిచేయాలని




అధికారులను ఆదేశించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కౌన్సిలర్ జంగా సుజాత, బేరింగ్ మౌలాలి, పాములపాటి శివమ్మ, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, మున్సిపల్ డి.ఈ అబ్దుల్ రహీమ్ టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ఉత్సాహంగా 'సంస్కృత భారతి' పరీక్షలు

పెన్ పవర్, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:

స్థానిక మహతి సంస్కృత శిక్షణ కేంద్రంలో ఆదివారం 'సంస్కృత భారతి' ఆధ్వర్యంలో సరళ, సుగమా పరీక్షలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. కొలచన మహతి పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షలకు సరళ విభాగంలో నలుగురు, సుగమా విభాగంలో 11 మంది విద్యార్థులు హాజరయ్యారు. తాడేపల్లిగూడెంలో ఈ కేంద్రం ద్వారా పరీక్షలు నిర్వహించడం ఇది వరుసగా రెండో ఏడాది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అధ్యక్షులు శ్రీ గరికిపాటి బాపయ్య శర్మ, సంస్కృత అధ్యాపిక బాలా త్రిపుర సుందరి మాట్లాడుతూ బాల్యం నుంచే సంస్కృత భాషపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొలచన శ్రీకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 34 దేశాల్లో విస్తరించిన సంస్కృత భారతి శాఖ మన పట్టణంలో ఉండటం విశేషమన్నారు.చిన్న వంతెన సమీపంలోని బ్రహ్మంగారి గుడి ఎదురు సందులో ఉన్న ఈ కేంద్రం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 బాలకేంద్రాల మాదిరిగానే సేవా దృక్పథంతో సంస్కృతాన్ని నేర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

# నాయనమ్మకు అంత్యక్రియలు నిర్వహించిన మనుమరాలు

పెన్ పవర్, మంగళగిరి

చిన్నతనం నుంచి కన్నతల్లి దూరమైనా అన్ని తానై ఆ మనుమరాలిని కన్న కూతురుకంటే మిన్నగా చూసుకున్న నాయనమ్మ మృతి చెందడంతో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించి రుణాన్ని తీర్చుకుంది ఓ మనమరాలు. వివరాలలోకి వెళితే... గుంటూరు నగరంలోని గుజ్జన గుండ్ల కు చెందిన వృద్ధురాలు పాశం లక్ష్మమ్మకు ఒక కుమారుడు, కుమార్తె కలరు. వృద్ధురాలి కొడుకు శ్రీనివాసరావు, కోడలు సుశీల కుటుంబ కలహాల నేపథ్యంలో గత మూడు దశాబ్దల క్రితం విడిపోయి వేరువేరుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె కాగా కుమారుడిని తల్లి సుశీల తన వెంట తీసుకుని వెళ్ళిపోగా ఏడాది వయసు కలిగిన చిన్నారి పాపను భర్త వద్దనే వదిలి పెట్టింది. దీంతో నాయనమ్మ లక్ష్మమ్మ ఆ చిన్నారి పాపను పెంచి పెద్ద చేసి మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం కు చెందిన నాగరాజు తో వివాహం జరిపించారు. గత ఏడేళ్ల క్రితం కుమారుడు మృతి చెందడంతో వృద్ధురాలు లక్ష్మమ్మ యర్రబాలెంలోని తన మనుమరాలి వద్దనే తలదాచుకుంటుంది. ఈ క్రమంలో వృద్ధాప్యంతో బాధపడుతున్న లక్ష్మమ్మ శనివారం రాత్రి తన మనుమరాలి నివాసంలోనే తుది శ్వాస విడిచింది. తనను చిన్నతనం నుంచి కన్న తల్లి కంటే మిన్నగా సాకిన నాయనమ్మ లక్ష్మమ్మ కు అంత్యక్రియలు నిర్వహించి తన రుణాన్ని తీర్చుకుంది.

# దేవరపల్లి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

పెన్ పవర్, దేవరపల్లి :

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం కారు మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైది. ఈ భారీ వర్షంతో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల హోర్డింగులు కూలిపోయాయి దీంతో ప్రజలు. ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు మరోపక్క ఈ భారీ వర్షంతో రోడ్లన్నీ నీట మునిగాయి. అకాల వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

# తండ్రి సన్నిధి మినిస్ట్రీస్ వారి మహా కూటములు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు విడదల రజిని

పెన్ పవర్, చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలోని రాజాపేట గ్రామంలో నిర్వహించిన తండ్రి సన్నిధి మినిస్ట్రీస్ వారి మహా కూటములు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు విడదల రజిని



# గ్రీన్ కార్డ్ కోసం 19 నెలల నిరీక్షణ: అమెరికా వలస వ్యవస్థలోని 'అనిశ్చితి'కి నిలువుటద్దం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా కలని నిజం చేసుకునే క్రమంలో గ్రీన్ కార్డ్ అనేది ఒక కీలక మైలురాయి. అయితే ఆ మైలురాయిని చేరుకోవడానికి కొందరికి పట్టే సమయం వర్ణనాతీతం. ఇటీవల ఒక వలసదారుడు రెడ్డిట్ వేదికగా పంచుకున్న తన 19 నెలల సుదీర్ఘ నిరీక్షణ కథనం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆవేదన మాత్రమే కాదు.. వేలాది మంది వలసదారులు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత జాప్యానికి నిదర్శనం.

**ఒక దరఖాస్తు.. రెండేళ్ల నిరీక్షణ**

సదరు అభ్యర్థి సెప్టెంబర్ 2024లో కుటుంబ ఆధారిత వలస కోసం ఐ-130 , ఐ-485 దరఖాస్తులను సమర్పించారు. ఫిబ్రవరి 2025లో ఐ-130 ఆమోదం పొందినప్పటికీ అసలైన ఐ-485 మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సాధారణంగా ఐ-130 ఆమోదం పొందాక ప్రక్రియ వేగవంతం కావాలి.. కానీ ఇక్కడ 19 నెలలు గడిచినా ఫలితం లేకపోవడం గమనార్హం.

**పాక్షిక ఊరట.. కానీ పూర్తి భరోసా లేదు..**

ప్రస్తుతానికి సదరు అభ్యర్థికి వర్క్ ఆథరైజేషన్ (ఈఏడీ) , అడ్వాన్స్ పరోల్ (ట్రావెల్ పర్మిట్) లభించాయి. ఇంటర్వ్యూ లేకుండానే ఇవి ఆమోదం పొందడం సానుకూలాంశమే అయినా అవి తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. ఇప్పటికీ సదరు అభ్యర్థి ఎఫ్-1 స్టూడెంట్ వీసా స్టేటస్‌లోనే కొనసాగుతున్నారు. గ్రీన్ కార్డ్




చేతికి వచ్చే వరకు కెరీర్ , వ్యక్తిగత జీవితంలో ఎటువంటి ధీమా ఉండదు. ఏ క్షణంలో ఏ మార్పు వస్తుందో అన్న భయం వలసదారులను వేధిస్తోంది.

**జాప్యానికి కారణాలు ఏమిటి?**

వలస నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ జాప్యానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. యూఎస్.సీఐఎస్ కి చెందిన కొన్ని ఫీల్డ్ ఆఫీసులు వేగంగా పని చేస్తాయి. మరికొన్ని ఆఫీసుల్లో దరఖాస్తుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఏళ్ల తరబడి సమయం పడుతుంది. అభ్యర్థి స్థానిక కాంగ్రెస్ ప్రతినిధి ద్వారా విచారణ జరిపించినా యూఎస్.సీఐఎస్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం.. వ్యవస్థలో ఉన్న పారదర్శకత లోపాన్ని సూచిస్తోంది.

**బాధితులకు ఉన్న మార్గాలేమిటి?**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారు చట్టపరమైన నిపుణుల సలహా మేరకు నడుచుకోవాలి. మొదటి ఇంక్వైరీ జరిగి చాలా కాలం అయినందున, మరోసారి ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకురావడం ముఖ్యం. ప్రభుత్వం తన విధిని సక్రమంగా నిర్వహించనప్పుడు కోర్టు ద్వారా ఆదేశాలు జారీ చేయించడం. ఇది యూఎస్.సీఐఎస్ ని నిర్ణయం తీసుకునేలా నిర్బంధిస్తుంది. ఇమ్మిగ్రేషన్ న్యాయవాదుల సలహాతో కేసులో సాంకేతిక లోపాలు ఏవైనా ఉన్నాయేమో సరిచూసుకోవడం అవసరం.ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతూ చట్టబద్ధంగా దరఖాస్తు చేసుకున్న వలసదారులు ఇలాంటి అనిశ్చితిని ఎదుర్కోవడం దురదృష్టకరం. 19 నెలల నిరీక్షణ అనేది కేవలం సమయానికి సంబంధించింది కాదు.. అది ఒక వ్యక్తి భవిష్యత్తు , మానసిక ప్రశాంతతకు సంబంధించింది. ఇప్పటికైనా యూఎస్.సీఐఎస్ తన ప్రాసెసింగ్ సమయాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బొగ్గుల శ్రీనివాస్ మృతి మిస్టరీ ఛేదించిన పోలీసులు.. అసలు కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, పాలేరు జలాశయంలోకి ఈనెల 14న కారు దూసుకెళ్లిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదొక సామాన్య రోడ్డు ప్రమాదమని అంతా భావించిన తరుణంలో, మత్స్యకారులు గుర్తించిన చిన్న చిన్న ఆధారాలు ఒక భయంకరమైన హత్యోదంతాన్ని బయటపెట్టాయి. కారు వెనుక సీటులో విగతజీవిగా ఉన్న రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతదేహం కేవలం ఒక ప్రమాద బాధితుడిది కాదు.. అది నమ్మిన స్నేహితుడే వెన్నుపోటు పొడిచిన కుట్రకు సాక్ష్యం. ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించిన వివరాలు, సమాజంలో ఆర్థిక లావాదేవీలు ప్రాణాల కంటే విలువైనవిగా మారుతున్న తీరును ఎత్తిచూపుతున్నాయి.

**ఆర్థిక విభేదాలే..**

బొగ్గుల శ్రీనివాస్, అతని స్నేహితుడు వేణు మాధవరెడ్డి మధ్య ఉన్న ఆర్థికపరమైన విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. అప్పుల గొడవలు లేదంటే వ్యాపార లావాదేవీల వల్ల తలెత్తిన మనస్పర్థలు చివరికి ఒకరి ప్రాణాలను తీసే స్థాయికి చేరుకున్నాయి. 'ధనం మూలం ఇదం జగత్' అన్న సూక్తి నేడు 'ధనం మూలం ఇదం హత్య' అన్నట్లుగా మారిపోయింది. తను ఆర్థికంగా ఎదిగేందుకు అడ్డుగా ఉన్నాడనే నెపంతో, ఏళ్ల తరబడి ఉన్న స్నేహాన్ని కాలరాసి, కిరాయి హంతకులను ఆశ్రయించడం వేణు మాధవరెడ్డిలోని నేర ప్రవృత్తికి నిదర్శనం.

**పథకం ప్రకారం..**

హత్యను సహజ మరణంగా లేదా ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు పకడ్బందీగా కుట్ర పన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులతో (పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, ఎండీ అజ్మత్ అలీ ఖాన్) ఒప్పందం కుదుర్చుకున్న వేణు, విజయవాడ వెళ్తున్నామని నమ్మించి శ్రీనివాస్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నార్కెట్‌పల్లి సమీపంలో పథకం ప్రకారం శ్రీనివాస్‌ను హత్య చేసి, అనంతరం ఆ మృతదేహాన్ని నేరం బయటపడకుండా పాలేరు జలాశయంలోకి కారుతో సహా తోసేయడం సినిమా కథను తలపిస్తోంది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నం, నేరగాళ్లు ఎంతటి తెలివితేటలను ఉపయోగిస్తున్నారో చెబుతోంది.

**మత్స్యకారుల అప్రమత్తత**

ఈ కేసులో మత్స్యకారుల పాత్ర అత్యంత కీలకంగా మారింది. కారు నీటిలోకి దూసుకెళ్లిన సమయంలో ఒక వ్యక్తి బయటకు దూకి తప్పించుకోవడం వారు గమనించడం వల్లే పోలీసులకు అనుమానం కలిగింది. శ్రీనివాస్ సోదరుడు అబ్బులయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. కూసుమంచి సీఐ, ఎస్ఐ బృందం తక్కువ సమయంలోనే కాల్ డేటా, స్థానిక సాక్ష్యాల ఆధారంగా నిందితులను పట్టుకోవడం అభినందనీయం. కారు ప్రమాదంగా మూసివేయాల్సిన ఫైలును, హత్య కేసుగా మార్చి నిజాలను వెలికితీయడం పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతోంది.

**మానవ సంబంధాల పతనం**

ఒకప్పుడు స్నేహం అంటే ప్రాణమిచ్చే బంధం. కానీ నేడు అదే స్నేహితుడు ప్రాణాలు తీసే యమధర్మరాజుగా మారుతున్నాడు. డబ్బు కోసం సొంత మనుషులను, స్నేహితులను చంపేందుకు వెనుకాడడం లేదంటే సమాజంలో నైతిక విలువలు ఎంత పతనమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. యూ ట్యూబర్‌గా, రచయితగా సమాజానికి తన గళం వినిపించిన శ్రీనివాస్ ఇలా అంతం కావడం సాహిత్య, డిజిటల్ రంగాలకు తీరని లోటు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడం, మితిమీరిన ఆశలు ఇలాంటి అనర్థాలకు దారితీస్తున్నాయి. శ్రీనివాస్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినప్పటికీ, వారికి చట్టం ద్వారా అత్యంత కఠినమైన శిక్షలు పడేలా చూడాలి. అప్పుడే ఇలాంటి నేరాలకు పాల్పడాలనుకునే వారికి భయం కలుగుతుంది. ఆర్థిక గొడవలను చర్చల ద్వారా లేదా చట్టపరంగా పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీయడం పరిష్కారం కాదు. సమాజంలో పెరుగుతున్న ఈ నేర సంస్కృతిని అరికట్టడానికి పోలీసు నిఘాతో పాటు, వ్యక్తిగత నైతికత కూడా అవసరం. బొగ్గుల శ్రీనివాస్ ఆత్మకు శాంతి కలగాలని, నిందితులకు తగిన శాస్తి జరగాలని కోరుకుందాం.

# కూర విషయంలో గొడవ.. తల్లిని చంపిన కొడుకు.. దారుణ ఘటన..

**హైదరాబాద్ పెన్ పవర్:** అమ్మ.. ఈ రెండక్షరాల పదంలోనే ప్రపంచమంత ప్రేమ దాగి ఉంటుంది. ఏ చిన్న కష్టం వచ్చినా ఆ గుండెను అక్కున చేర్చుకునే ఆత్మీయత తల్లిది. కానీ, కళ్ల ముందే తిరుగుతున్న కొడుకును చూసి మురిసిపోయిన ఆ తల్లి, తను ప్రేమతో వండిన కూరే తన పాలిట మృత్యుపాశం అవుతుందని ఊహించలేకపోయింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, డోంగర్గావ్ గ్రామంలో జరిగిన ఈ ఘోర కలి కాలపు వికృత చేష్టకు నిలువుటద్దం. కేవలం ఇంట్లో కాకరకాయ కూర వండినందుకే కన్నతల్లిని కడతేర్చిన ఆ కిరాతకుడి చర్య, సభ్య సమాజం తలదించుకునేలా చేస్తోంది.

**మద్యం రక్కసి.. చిద్రమవుతున్న సంసారాలు**

ఈ ఘోరానికి ప్రధాన కారణం మద్యం. నిందితుడు జగదీష్ పెట్కులే మద్యానికి బానిస కావడంతో ఇప్పటికే అతని సంసారం చిన్నాభిన్నంగా మారింది. తాగుడు వల్ల కలిగే వేధింపులు భరించలేక అతని భార్య అతన్ని వదిలి వెళ్లిపోయింది. భార్య వెళ్లినా, కొడుకు బాగుపడతాడని ఆశపడిన ఆ వృద్ధురాలు అతనికి తిండిపెడుతూ తనే చూసుకుంటుంది. కానీ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన కొడుకు.. తనకు నీడనిచ్చిన తల్లిని కూడా మనిషిగా గుర్తించలేకపోయాడు. మద్యం అనేది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు.. అతని చుట్టూ ఉన్న కుటుంబాలనే సర్వనాశనం చేస్తుందని ఈ ఘటన నిరూపించింది.

**విచక్షణారహిత దాడి**

ఘటన జరిగిన రాత్రి జగదీష్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. ఇంట్లో చేసిన కాకరకాయ కూరను చూసి ఆగ్రహానికి లోనయ్యాడు. ఒక సామాన్యమైన కూర విషయంపై తల్లితో గొడవకు దిగడం, అది హత్య వరకు దారితీయడం అత్యంత విచారకరం. సహనం కోల్పోయి తల్లిపై విచక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. ఇక్కడ సమస్య కేవలం కూర మాత్రమే కాదు, మద్యం వల్ల ఆ వ్యక్తి మెదడులో కలిగిన అస్థిరత. చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసే స్థాయికి మనిషి వెళ్తున్నాడంటే, సమాజంలో హింస ఎంతగా వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు.

**నేర ప్రవృత్తి.. సామాజిక విశ్లేషణ**

హత్య చేసిన అనంతరం జగదీష్ గ్రామంలో తిరుగుతూ 'నేను మా అమ్మను చంపాను' అంటూ గట్టిగా కేకలు వేయడం అతనిలోని నేర ప్రవృత్తికి మత్తులో ఉన్న అపస్మారక స్థితికి నిదర్శనం. ఒక ఘోరమైన తప్పు చేశాననే పశ్చాత్తాపం కంటే, మద్యం మత్తులో ఆ విషయాన్ని ప్రకటించడం అతని వికృత మనస్తత్వాన్ని చూపిస్తోంది. గ్రామస్తులు సకాలంలో స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

**మద్య నిషేధం అవసరమా?**

ఇలాంటి ఘటనలు ఏదో ఒక మారుమూల గ్రామంలో జరిగే చిన్న గొడవలు కావు. ఇవి దేశవ్యాప్తంగా ఉన్న మద్యపాన సమస్యకు సూచికలు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే, దానివల్ల విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు, జరుగుతున్న నేరాల వల్ల కలిగే నష్టం దేశానికి ఎంతో ఎక్కువ. మద్యానికి బానిసలైన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, గ్రామ స్థాయిల్లో మద్యం విక్రయాలపై నియంత్రణ విధించడం అత్యవసరం. కేవలం ప్రభుత్వాలే కాకుండా, సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యతగా మెలగాలి.

# పవన్ ను కదిలించిన ఊరు.. రూ.50 లక్షల విరాళం, వెరీ ఇంట్రెస్టింగ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఓ గ్రామం కదిలిచింది. రెండేళ్ల క్రితం ఆ గ్రామానికి వెళ్లిన పవన్ లో సెంటిమెంట్ ను రగిలిచింది. అప్పటి నుంచి ఆ ఊరు పవన్ సొంతూరుగా మారిపోయింది. 20 నెలల వ్యవధిలో గ్రామం రూపురేఖలు మారిపోయేలా చేసింది. పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రభుత్వ నిధులతో ఆ గ్రామాభివృద్ధికి బాటల పరిచిన పవన్.. గ్రామంపై పెంచుకున్న మమకారంతో సొంతంగా రూ.50 లక్షలు సమకూర్చారు. రాష్ట్రంలో వేలాది గ్రామాలు ఉండగా, పవన్ ఆ గ్రామంపై అంతలా ప్రేమ పెంచుకోవడానికి కారణం చాలా చిన్నదే. కానీ, అది చాలా తీవ్రమైన భావోద్వేగానికి సంబంధించినది.. ఆ సంబంధమే పవన్ ఇంటిపేరు. ఆ ఊరి పేరు ఒక్కటి కావడమే.. నిజమే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటి పేరు ఉండటమే నంద్యాల జిల్లాలోని 'కొణిదల' గ్రామం రూపురేఖలను మార్చివేసింది. నందికొట్కూరు మండలంలో ఉన్న ఈ గ్రామం 20 నెలల క్రితం వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పర్యటించిన పవన్ కళ్యాణ్ తన ఇంటి పేరు ఉన్న గ్రామం కోసం తెలుసుకుని ప్రేమ పెంచుకున్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. అధికారంలోకి రాగానే 'కొణిదల' గ్రామాన్ని ప్రత్యేక ఆసక్తితో అభివృద్ధి చేయిస్తున్నారు పవన్.పంచాయతీరాజ్ మంత్రిగా కొణిదల గ్రామానికి అనేక నిధులు విడుదల చేశారు పవన్. పల్లెపండగ 1.0, పల్లెపండగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి చేశారు. గోకులాలు, బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణ పథకం కింద గ్రామానికి భారీగానే లబ్ధి జరిగింది. సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులతో కొణిదెల గ్రామ రూపురేఖలే మార్చివేశారు పవన్. అంతేకాకుండా సొంతంగా రూ.50 లక్షలు విరాళంగా సమకూర్చి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పవన్ దృష్టిని కొణిదెల ఆకర్షించినట్లు చెబుతున్నారు. గత ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం ఆ గ్రామాభివృద్ధికి రూ. 50 లక్షల విరాళం అందజేశారు. ఈ డబ్బుతో కొణిదెల గ్రామంలో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. ఈ ట్యాంక్ కొణిదెల గ్రామంలో 2 వేల మంది దాహార్తి తీర్చనుంది. వేసవికి ముందే ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, గ్రామీణ నీటి సరఫరా విభాగం (=బొ) అధికారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

పవన్ చొరవతో కొణిదెల గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పల్లెపండగ 1.0లో సుమారు రూ. 20 లక్షలకు పైగా నిధులు వెచ్చించి మూడు రహదారులను నిర్మించారు. పల్లెపండగ 2.0లో రూ. 45 లక్షల అంచనా వ్యయంతో ఏడు సీసీ రోడ్లు నిర్మించారు. వీటితో పాటు గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ నిధులతో కొణిదెల గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ నుంచి పగిద్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బి.టి. రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొణిదెల గ్రామం వరకు ఉన్న రోడ్డు పునరుద్ధరణ పనులకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు ఆ గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్ ను జాతీయ ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేశారు. రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్స్ మరమ్మత్తులు పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్తులు అడిగిన ప్రతి పని చేస్తూ కొణిదలను తన సొంతూరుగా మార్చుకున్నారు పవన్.

# మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' లొంగుబాటు.. 6 దశాబ్దాల సాయుధ పోరాటానికి తెర!

**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆరు దశాబ్దాల సాయుధ పోరాటం ముగింపు దశకు చేరిందన్న సంకేతాలను నిజం చేస్తూ ఆ పార్టీ అగ్రనేత దేవ్ జీ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతోపాటు మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు రాజిరెడ్డి, మరో 16 మంది కీలక నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దేవ్ జీ టార్గెట్ గా కేంద్ర బలగాలు రెండు రోజుల కిందట ఆపరేషన్ కర్రె గుట్టలు-2 చేపట్టినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దేవ్ జీతోపాటు మావోయిస్టు కీలక నేతలు తెలంగాణలోని అసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబి పోలీసులకు లొంగిపోయినట్లు చెబుతున్నారు. దేవ్ జీ లొంగుబాటును ఇంకా అధికారికంగా ప్రకటించాల్సివుంది.మావోయిస్టు ప్రధాన కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి లొంగుబాటు వార్తలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్ ఆవిష్కరిస్తామని కేంద్రం ప్రకటించింది. మునుపెన్నడూ లేనట్లు తీవ్ర నిర్బంధం అమలు చేయడంతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అయింది. ఈ నేపథ్యంలో కీలక నేతలు ఉద్యమాన్ని వదిలి ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. మరికొందరు అగ్రనేతలు పోలీసు ఎన్ కౌంటరులో అసువులు బాశారు. కొద్ది నెలల క్రితం మావోయిస్టు కేంద్ర కమిటీ నేత మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగుబాటు సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి దేవ్ జీ లొంగిపోవడంతో ఉద్యమాన్ని నడిపే నాథుడే కరువైనట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణం తర్వాత దేవ్ జీ పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆపరేషన్ కగార్



కొనసాగుతుండగానే ఆయన పార్టీ బాధ్యతలు భుజానకెత్తుకున్నారు. నంబాల కేశవరావు ఎన్కౌంటర్ తర్వాత దేవ్ జీ లక్ష్యంగా బలగాలు పావులు కదిపాయి. ఈ క్రమంలోనే గత ఏడాది నవంబరులో దేవ్ జీ విజయవాడలో పోలీసులకు చిక్కినట్లు ప్రచారం జరిగింది. విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో తలదాచుకున్న సుమారు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దేవ్ జీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉన్నట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించారు.ంఅయితే అప్పట్లో దేవ్ జీ అరెస్టుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. కానీ దేవ్ జీ సురక్షితంగా ఉన్నట్లు మావోయిస్టులు ప్రకటించడంతో ఈ వదంతులకు ఫుల్ స్టాప్ పడ్డాయి. ఇక తాజాగా దేవ్ జీ లొంగుబాటులో ఉద్యమం చివరి దశకు చేరుకున్నట్లు భావిస్తున్నారు. దేవ్ జీతోపాటు కీలక నేత మల్లా రాజిరెడ్డితోపాటు మరో 16 మంది లొంగిపోయారన్న వార్తలతో మావోయిస్టు ఉద్యమం పరిసమాప్తమైనట్లే అంటున్నారు.

గత ఏడాది మావోయిస్టు పార్టీ బాధ్యతలు చేపట్టిన దేవ్ జీ తెలంగాణలోకి జగిత్యాల జిల్లా కోరుట్ల. 1982లో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన తిరుపతి అప్పట్లోనే నక్సల్ ఉద్యమం కోసం అడవి బాట పట్టారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు.

1993-94 ప్రాంతంలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా ఎంపికయ్యారు. మావోయిస్టు పార్టీలో నక్సలైట్లు విలీనం అయిన తర్వాత దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఏర్పాటు చేసిన తొలి దళానికి తిరుపతి కమాండర్ గా పనిచేసినట్లు చెబుతున్నారు. తిరుపతికి దేవ్ జీతోపాటు అనేక మారుపేర్లతో పిలుస్తారు. సంజీవ్, చేతన్, సుదర్శన్, రమేష్ వంటి పేర్లతో తిరుపతి పనిచేశారు.

# ధోని రిటైర్మెంట్ ఊహాగానాలకు బ్రేక్.. సీఎస్‌కే సీఈఓ బిగ్ అప్‌డేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ చేస్తారనే ఊహాగానాలకు బ్రేక్ పడింది. మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమైతున్నట్లు తెలుస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కూడా ధోనీ ఆడబోతున్నారని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సీఈఓ కాశీ విశ్వనాథన్ ధృవీకరించారు. కాగా ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు సార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఐపీఎల్ కెరీర్‌లో అతడు మొత్తం 235 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించగా, 136 విజయాలు సాధించారు. ధోని కెప్టెన్సీ విజయం శాతం 57.87గా ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచే చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్న ధోనీ, ఫ్రాంచైజీకి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా చరిత్ర సృష్టించారు. ఈ ఐదు ట్రోఫీలు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు ధోనీ కెప్టెన్సీ బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించినప్పటికీ, ఆటగాడిగా మాత్రం జట్టుతోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు 2026 సీజన్‌లోనూ అతని అనుభవం సీఎస్‌కేకు కీలకంగా మారనుంది. అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో సీఎస్‌కే మొత్తం 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే కీలక మార్పులు చేసింది. సంజూ శాంసన్‌ను రూ.18 కోట్ల జట్టులోకి తీసుకుంది. అదే సమయంలో రవీంద్ర జడేజా (రూ.14 కోట్లు), సామ్ కరన్ (రూ.2.4 కోట్లు) ట్రేడ్ ద్వారా రాజస్థాన్ రాయల్స్‌కు వెళ్లారు. రాహుల్ చాహర్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, మ్యాథ్యూ షార్ట్,
సర్ఫరాజ్ ఖాన్ లాంటి అనుభవజ్ఞులతో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కార్తిక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లపై ఒక్కొక్కరికి రూ.14.2 కోట్లతో కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. ధోనీ మరోసారి మైదానంలోకి దిగనుండటంతో, సీఎస్‌కే అభిమానుల్లో ఉత్సాహం మరోసారి పిక్స్‌కు చేరింది.

# దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్... టీమిండియా ముందు భారీ టార్గెట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ సూపర్ 8 పోరులో దక్షిణాఫ్రికా జట్టు, టీమిండియా ముందు 188 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. డేవిడ్ మిల్లర్ (63), డెవాల్డ్ బ్రెవిస్ (45), ట్రిస్టన్ స్టబ్స్ (44లి) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (3/15) అద్భుత ప్రదర్శన చేసినా, ఇతర బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 20 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్వింటన్ డి కాక్ (6), కెప్టెన్ మార్‌క్రమ్ (4), ర్యాన్ రికెల్టన్ (7) విఫలమయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు.బ్రెవిస్ ఔటైన తర్వాత మిల్లర్, స్టబ్స్ మరింత దూకుడుగా ఆడారు. ముఖ్యంగా మిల్లర్ కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 63 పరుగులు చేయగా, చివర్లో స్టబ్స్ 24 బంతుల్లోనే 44 పరుగులు చేసి స్కోరును 180 దాటించాడు. భారత బౌలర్లలో బుమ్రా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు తీశాడు. అయితే, హార్దిక్ పాండ్యా (45), వరుణ్ చక్రవర్తి (47) ధారాళంగా పరుగులు ఇవ్వడం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది.

# పేకమేడలా కూలిపోయిన లంక లైనప్... ఇంగ్లండ్ అద్భుత విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ సూపర్–8 పోరులో ఇంగ్లండ్ జట్టు శ్రీలంకపై 51 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో శ్రీలంక పూర్తిగా విఫలమైంది. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 16.4 ఓవర్లలో కేవలం 95 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై లంకేయులకు ఇది దిగ్భ్రాంతి కలిగించే పరాజయం.147 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్లు పతుమ్ నిస్సంక (9), కమిల్ మిషార (6) త్వరగా వెనుదిరిగారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగే (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. కేవలం 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది.కెప్టెన్ దసున్ షనక (30 పరుగులు, 24 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసినా, అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. కమిందు మెండిస్ (13) కాసేపు నిలిచినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ్ బౌలర్ల క్రమశిక్షణాయుత బౌలింగ్‌కు లంక బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. స్పిన్నర్ విల్ జాక్స్ కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో లంక పతనాన్ని శాసించగా, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ జోస్ బట్లర్ (7) విఫలమయ్యాడు. అయితే, ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (62 పరుగులు, 40 బంతుల్లో, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, సాల్ట్ దూకుడుగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. హ్యారీ బ్రూక్ (14), విల్ జాక్స్ (21) చివర్లో వేగంగా ఆడటంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో యువ స్పిన్నర్ దునిత్ వెల్లలాగే 26 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మహీశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక చెరో రెండు వికెట్లతో రాణించారు.


# మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు.మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు. మరి అతడితో జాన్వీ సినిమా చేసిందా? అంటే ఇంత వరకూ సాధ్యపడలేదు. చాలా కాలంగా రణబీర్ కపూర్ సరసన నటించాలని జాన్వీ భావిస్తోంది. ఓపెన్ గానే ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పింది. కానీ బాలీవుడ్ మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ఆమె ఆసక్తిని మోహిత్ సూరి గమనించాడో? ఏమోగానీ ఆ ఛాన్స్ తానే ఇస్తానంటూ ముందుకొచ్చాడు.



లేత-రంగు చీరలో ప్రియా భవాని శంకర్ స్టన్స్

రణబీర్ కపూర్ హీరోగా ఓ గ్యాంగ్ స్టార్ మ్యూజికల్ లవ్ స్టోరీని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. వాస్తవానికి మోహిత్ సూరి కూడా చాలా కాలంగా రణబీర్ తో సినిమా



చేయాలనుకుంటున్నాడు. కానీ రణబీర్ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. ఇంతకాలానికి ఆ కాంబినేషన్ సెట్ అయింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని తీసుకోవాలి? అనే చర్చ మోహిత్ టీమ్ లో జరగగా..ఆయన మరో ఆలోచన లేకుండా జాన్వీ కపూర్ ను ఫిక్స్ చేసారట. జాన్వీ కపూర్ ఆసక్తిని గమనించే మోహిత్ ఈ ఛాన్స్ కల్పించినట్లు వెలుగులోకి వస్తోంది.
తాను ఎవరో నటిని తీసుకోవడం కంటే? అభిమాన హీరోకి జోడీగా తననే తీసుకుంటే? కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుంది. చాలా సన్నివేశాల విషయంలో రాజీ పడాల్సిన పని ఉండదు. పైగా మోహిత్ సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో ఘాడత కూడా ఎక్కువగానే ఉంటుంది. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాలకు సైతం నో చెప్పడానికి ఛాన్స్ ఉండదు. సెట్స్ కు వెళ్లిన తర్వాత ఏ నటి అయినా దర్శకుల హీరోయిన్ గా పనిచేయాల్సిందే. అందుకు జాన్వీ కపూర్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో 'పెద్ది' లో రామ్ చరణ్ కు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో మాత్రం మోహిత్ సూరి ప్రాజక్ట్ తప్ప ఇంకే సినిమాకు కమిట్ అవ్వలేదు. మోహిత్ సూరి పిలిచి ఇస్తోన్న అవకాశం కాబట్టి జాన్వీ ఆనందంతో ఉబ్బితబ్బితోంది.



ఐశ్వర్య మీనన్ యొక్క బ్రీజీ సీసైడ్ అవుట్‌ఫిట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com